క్లుప్తంగా

ఉన్నతోద్యోగం పొందిన కార్యదర్శికి సన్మానం



రాకేష్‌ను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సత్యవేడు: మండలంలోని అల్లవుగుంట సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎస్.రాకేష్‌కు హైకోర్టులో అసిస్టెంట్ క్లర్కుగా ఉన్నతోద్యోగం రావడంతో సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సచివాలయ సిబ్బంది కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో లీలామాధవరావు, కే. సురేష్ నాయక్, యూ.ప్రకాష్, బి.వాసు, జలజశ్రీ, మాధవి, మునిరవికుమార్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

రెండవ రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): ఇంటర్ ద్వితీయ సంవత్సరం మొదటి పరీక్షలు గురువారం ప్రశాంతగా జరిగాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. పరీక్ష కేంద్రంలో విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, బెంచీలు ఏర్పాటు చేశారు. పరీక్షలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించారు. మండలంలోని ఎస్వీఏ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ పరీక్షకు 380 విద్యార్థులు హాజరు కావాల్సిఉండగా 373 మంది హాజరయ్యారు. ఏడుగురు పరీక్షకు హాజరు కాలేదు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రక్తహీనత గర్భిణులను గుర్తించండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అభిజ్ఞ

ఏర్పేడు: గ్రామాల్లో రక్తహీనత కలిగిన గర్భిణులను గుర్తించాలని డాక్టర్ అభిజ్ఞ అన్నారు. గురువారం మండలంలోని పాపానాయుడుపేట పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని గురించి అవగాహన కల్పించాలన్నారు. ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలను ప్రజలకు సూచించాలన్నారు. ఈ నెల 20న జరిగే ప్రపంచ ఓరల్ హెల్త్ డే సందర్భంగా ప్రజలకు నోటి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్త సుబ్రమణ్యం మృతి



సుబ్రమణ్యం (ఫైల్)

ఏర్పేడు: మండలంలోని కోబాక ఎస్టీ కాలనీకి చెందిన సామాజిక కార్యకర్త, గిరిజన సమాఖ్య వ్యవస్థాపకుడు సుద్దాల సుబ్రమణ్యం(65) గురువారం మృతిచెందాడు. ఆయన గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. గతంలో ఆయన పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయన మృతి పట్ల పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. శుక్రవారం కోబాక ఎస్టీ కాలనీలో ఆయన అంత్యక్రియలు జరుగనున్నాయి.

ఎస్వీబీసీకి రూ.11లక్షల విరాళం



తిరుపతి అలిపిరి: మహారాష్ట్రకు చెందిన సునీత లఖన్ కుమార్ అగర్వాల్ గురువారం ఎస్వీబీసీ ట్రస్ట్‌కు రూ.11 లక్షల విరాళం ఇచ్చారు. డీడీని ఆయన ప్రతినిధులు రాఘవేంద్ర, బాలసుదర్శన్ రెడ్డి ఎస్వీబీసీ కార్యాలయంలో చైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర, సీఈవో షణ్ముఖ్ కుమార్‌కు అందజేశారు.

రుయా ల్యాబ్ తనిఖీ

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రిలోని ల్యాబ్‌ను గురువారం సీఎస్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మోనాయక్ తనిఖీ చేశారు. అసిస్టెంట్ ఆర్ఎంవో అన్వేష్‌రెడ్డితో కలిసి ల్యాబ్ పనితీరును పరిశీలించారు. రోగులకు అక్కడ చేస్తున్న పరీక్షల సంఖ్య, రికార్డుల నమోదుపై ఆరా తీశారు. పరీక్షల వివరాలను పక్కాగా నమోదు చేయాలని, వైద్యుల సూచనలు ఉంటేనే పరీక్షలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

స్విమ్స్‌లో డయాగ్నసిస్ స్క్రబ్‌పై శిక్షణ

తిరుపతి తుడా : స్విమ్స్‌లో డిపార్టుమెంట్ ఆఫ్ క్లినికల్ వైరాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం సిరోలాజికల్ డయాగ్నసిస్ ఆఫ్ స్క్రబ్ టైఫస్ శిక్షణ ఇచ్చారు. స్విమ్స్ డైరెక్టర్ బి.వెంగమ్మ వైద్యరంగంలో డయాగ్నిసిస్ ప్రాధాన్యతను వివరించారు.

ఇందిరానగర్‌లో అక్రమ కట్టడాలపై విచారణ



ఇందిరానగర్‌లో విచారణ చేపడుతున్న జిల్లా అధికారులు

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలపై జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అభివృద్ధి అధికారి సుశీల గురువారం విచారణ చేపట్టారు. స్థానికులు కొందరు అక్రమ కట్టడాలపై లోకాయుక్తలో ఫిర్యాదు చేయడంతో విచారణకు వచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా పెద్దఎత్తున అక్రమంగా భవనాలు నిర్మాణం చేయడం, ఆ భవనాలకు విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు ఎన్‌ఓసీలు ఏ ప్రాతిపదికను ఇచ్చారని స్థానిక పంచాయతీ కార్యదర్శి ప్రశ్నించారు. గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు పెద్దఎత్తున ఎన్‌ఓసీల కోసం మామూళ్లు తీసుకున్నట్లు ఫిర్యాదుదారుడు తన ఫిర్యాదులో పేర్కొనడంతో ఆ దిశగా కూడా విచారణ చేపట్టారు. ఇక్కడ నిర్మాణం చేపడుతున్న కట్టడాల గురించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి లోకాయుక్తకు అందజేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, ఈఓపీఆర్డీ విజయకుమారి, స్థానిక సర్పంచ్ వీరభద్రం తదితరులు ఉన్నారు.

గురుదక్షిణామూర్తికి విశేష పూజలు



విశేష అలంకరణలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ చేసి వినాయకపూజ, కలశ పూజ, పలు వైదిక క్రతువులను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకించారు. సుగంధ పుష్పాలతో అలంకరించి స్వర్ణాభరణాలలో అలంకరించారు. అలాగే స్వామివారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాలువకు మరమ్మతులు



వరవకాలువకు మరమ్మతులు చేస్తున్న కూలీలు

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామంలోని పంట పొలాలకు నీరందించే వరవ కాలువ మరమ్మతు పనులను ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టారు. పనులు జోరుగా సాగుతున్నాయి. గ్రామంలోని వరవ కాలువకు మరమ్మతు పనులను 120 మందితో చేస్తున్నారు. అదనంగా భూముల అభివృద్ధి, చెరువుకట్టపై చెట్టు పుట్టలను తొలగించటం వంటి పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు నెలరోజులపాటు చేస్తామని ఏపీఓ భానుప్రియ తెలిపారు. కూలీలకు రోజుకు రూ.250 కూలి గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి





వినాయక మృతదేహం, వినాయక (ఫైల్)

ఏర్పేడు: మండలంలోని ఆమందూరు గ్రామానికి చెందిన వినాయక(40) గురువారం వెంకటగిరి రోడ్డులోని ఐఐటీ తిరుపతికి ఎదురుగా ఉన్న చెరువులో మేకలు తోలాడు. ఆపై చెరువులోకి దిగి ఊపిరాడక మృతిచెందాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి శ్రీకాళహస్తి అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని చెరువులో మృతిచెందిన వినాయక మృతదేహాన్ని బయటకు తీశారు. ఆపై పోస్టుమార్టం కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి



పొట్టి శ్రీరాములు చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. అన్నారు. పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా బుధవారం కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో అహోబిలం పీఠాధిపతి





అమ్మవారిని దర్శించుకున్న అహోబిళం పీఠాధిపతి, తిరుమలలో సినీ నటుడు ఉపేంద్ర

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని గురువారం అహోబిలం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ తన శిష్యబృందంతో కలిసి దర్శించుకున్నారు. వారికి ఆలయ ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా కన్నడ ప్రముఖ సినీ హీరో ఉపేంద్ర తిరుమల శ్రీవారిని, పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఫొటోలు తీసుకున్నారు. కార్యక్రమంలో వీఐ రామ్మోహన్, నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్ విద్యార్థులకు అవార్డులు

తిరుపతి తుడా: మహారాష్ట్రలోని డాక్టర్ ఎబీజె అబ్దుల్‌కలామ్ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీలో ఈనెల 11వ తేదీ వరకునిర్వహించిన జాతీయ సదస్సులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులను ప్రకటించారు. శాస్త్రీయ పోస్టర్ ప్రదర్శనలో తృతీయ బహుమతితోపాటు మరో ఐదు బహుమతులు, వాలీబాల్ క్రీడలో ద్వితీయ, డ్యాన్స్‌లో రెండు, సింగింగ్‌లో ఒకటి, బ్యాడ్మింట్‌లో మూడు బహుమతులు కైవసం చేసుకున్నట్టు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు.

ఎస్వీసీఈలో జాతీయ సదస్సు ప్రారంభం

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి-కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం భౌతిక, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నానో స్ట్రక్చర్డ్ మెటీరియల్స్ టు బ్యాటరీ అండ్ సూపర్ కెపాసిటర్స్(ఎస్ఎంబీఎస్-2023) అన్న అంశంపై జాతీయ స్థాయి సదస్సు ప్రారంభమైంది. ఇందులో ముఖ్యఅతిథులుగా తిరుపతి ఐసర్ రసాయన శాస్త్ర విభాగపు డీన్ ప్రొఫెసర్ విజయమోహన్ కె.పిళ్లై, బెంగళూరులోని రేవ యూనివర్సిటీ రసాయన శాస్త్ర విభాగపు ప్రొఫెసర్ డిహెచ్.నాగరాజులు పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న కాలుష్యాన్ని, వనరుల కొరతను నియంత్రించడంలో బ్యాటరీ ఆధారిత వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. తద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు కార్బన్ రహిత సమాజాన్ని స్థాపించవచ్చని తెలిపారు. సదస్సులో ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి.చంద్రశేఖర్‌రావు, విభాగాధిపతి ఎస్.మనోహర్‌రెడ్డి, కన్వీనర్ పి.బాబు, కోకన్వీనర్ కె.రెడ్డిమోహన్ పాల్గొన్నారు.

బీసీ సంఘం నూతన కమిటీ ఎంపిక



నియామక పత్రాలు అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా నేతలు

తిరుపతి కల్చరల్: ఏపీ బీసీ సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడుగా మధు మార్గాచార్య, తిరుపతి నగర ఉపాధ్యక్షులుగా కె.మునిరాజ, మురళీగౌడ్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. సంఘం కార్యాలయంలో గురువారం నియామక పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం రాజకీయ పార్టీగా ఆవిర్భవిస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో పలువురు సంఘంలో చేరుతున్నారని పేర్కొన్నారు. రాబోవు ఎన్నికల లోపు జిల్లాలో సంఘం నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

ఐఎఫ్‌టీయూ మహా సభలపై సమావేశం

తిరుపతి కల్చరల్: తిరుపతిలో ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో నిర్వహించనున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని జాతీయ నేతలు పిలుపునిచ్చారు. మహాసభల నిర్వహణపై గురువారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జాతీయ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం జాతీయ అధ్యక్షురాలు అపర్ణ, ప్రధాన కార్యదర్శి బి.ప్రదీప్, రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ సభ, సమావేశ స్థలాలను పరిశీలించారు. సభ ఏర్పాట్లపై నాయకులతో చర్చించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సుబ్రమణ్యంతో పాటు అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా సీనియర్ నేతలు వెంకటరత్నం, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి

చంద్రగిరి: మండలంలోని మల్లయ్యపల్లి వద్ద ఈ నెల 12న కారు చెట్టును ఢీకొని గాయపడిన మహిళ బుధవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మదనపల్లికి చెందిన అమల(30) తన బంధువులతో కలిసి రామచంద్రాపురం మండలంలో జరిగిన వేడుకలో పాల్గొని కారులో చంద్రగిరికి తిరుగు ప్రయాణమయ్యారు. మల్లయ్యపల్లి వద్ద వస్తున్న క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. తలకు తీవ్ర గాయాలైన అమలను తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని గురువారం బంధువులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

భాషపై మక్కువ పెంచుకోవాలి



విద్యార్థులకు తెలుగు భాషపై అవగాహన కల్పిస్తున్న ఎంఈవో

పాకాల: విద్యార్థులు చిన్నతనం నుంచే తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలని ఎంఈవో బాబ్జీ తెలిపారు. ఆయన గురువారం పోలిశెట్టివారిపల్లి, పత్తిపాటివారిపల్లి, పదిపుట్లబైలు పాఠశాలలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తెలుగు భాషపై మక్కువ చూపేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి రోజూ ప్రార్థనా సమయంలో వేమన, సుమతి శతకాల్లోని పద్యార్థులు పిల్లలు చెప్పేలా చూడాలన్నారు. గ్రంథాలయాలకు ప్రభుత్వం అందజేసిన పుస్తకాలను చదివించాలన్నారు. హెచ్ఎంలు రెడ్డెమ్మ, ప్రమీలమ్మ, ఉపాధ్యాయులు వెంకటాచలం, సరితకుమారి, ఆసియా, మోహన్, ఉదయ్‌కుమార్, సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన లారీ



పోలీసులు అక్కడికి చేరుకుని లారీని బయటకు తీశారు.

చంద్రగిరి: పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలోని కల్‌రోడ్డుపల్లి వద్ద గురువారం ప్రమాదవశాత్తు లారీ కాలువలోకి దూసుకెళ్లింది. పోలీసుల కథనం మేరకు.. లారీ చెన్నై నుంచి కోలార్‌కు నూనె ప్యాకెట్లతో వెళుతోంది. కల్‌రోడ్డుపల్లి వద్ద డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో లారీ రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే వాహనాన్ని అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని లారీని బయటకు తీశారు.

రిక్వెస్ట్ స్టాపింగులపై రోజూ రగడ

తిరుపతి అర్బన్: ఆర్టీసీ డ్రైవర్ల దూకుడు ఏ మాత్రం తగ్గడం లేదు. ప్రయాణికులతో వాగ్వాదానికి దిగుతూ ఆర్టీసీ ప్రతిష్టను దిగజారుస్తున్నారు. ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని, దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసినా పెడచెవిన పెడుతున్నారు. ప్రధానంగా రాత్రిళ్లు రిక్వెస్ట్ స్టాపింగులపై రగడ కొనసాగుతూనే ఉంది. తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి రూ.65 టికెట్ ఉంది. ప్రయాణికులు ఎక్స్‌ప్రెస్ లేదా నాన్‌స్టాప్ బస్సుల్లో ఎక్కి తమ అవసరాల నిమిత్తం మార్గమధ్యంలో రేణిగుంట, ఏర్పేడులో దిగడానికి డ్రైవర్‌ను రిక్వెస్ట్ చేసుకుంటున్నా ఒప్పుకోవడం లేదు. వారు బస్సు ఎక్కేటప్పుడు కండక్టర్ నుంచి అనుమతి తీసుకునే ఎక్కుతున్నా ఫలితం లేదు. ఇటీవల తిరుపతి-శ్రీకాళహస్తి రోడ్డులోని తొండమనాడు క్రాస్ వద్ద ప్రయాణికులు, డ్రైవర్ ఒకరిపై ఒకరు దాడికి దిగిన విషయం తెలిసిందే. అలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా జిల్లా ఆర్టీసీ పెద్దలు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కండలేరును సందర్శించిన చెన్నై బృందం



అధికారులతో సమీక్షిస్తున్న చెన్నై బృంద సభ్యులు

రాపూరు: చెన్నై మెట్రో బృందం సభ్యులు గురువారం తిరుపతి జిల్లాలోని కండలేరు జలాశయాన్ని సందర్శించారు. కండలేరు నుంచి వివిధ ప్రాంతాలకు వెళుతున్న కాలువలు, హెడ్‌రెగ్యులేటర్‌ను సందర్శించి, జలాశయ అధికారులతో సమీక్షించారు. జలాశం నుంచి చెన్నైకు ఇప్పటివరకు విడుదల చేసిన జలాల వివరాలు, అందించాల్సిన నీటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. చెన్నై మెట్రో వాటర్ సీఈ జయకర్ జేస్ దాస్, ఎస్ఈలు ముత్తయ్య, సుగంతి, ఈఈ కాశీ, కండలేరు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి, డీఈలు సుధాకర్, ఓబుల్‌దాస్, లాల్‌జాన్సన్ పాల్గొన్నారు.

ప్రబలుతున్న విష జ్వరాలు

- పొయ్యి ఎస్సీ కాలనీలో జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు
- తూతూమంత్రంగా మెడికల్ క్యాంపు





జ్వరాలతో మంచం పట్టిన రత్నమ్మ, నిషాంత్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): తొట్టంబేడు మండలం పొయ్య పంచాయతీ ఎస్సీ కాలనీ ప్రజలు విష జ్వరాలు ప్రబలి అల్లాడుతున్నారు. ఇటీవల తూతూమంత్రంగా మెడికల్ క్యాంపు నిర్వహించడంతో అధికారుల తీరుపై గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లల దగ్గర నుంచి పెద్దల వరకు ఇళ్లకే పరిమితమై జ్వరాలతో ఇబ్బంది పడుతుంటే అధికారులు ఏమీ లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటీవల తాగునీరు కలుషితం కావడంతో జ్వరాలు వస్తున్నాయని తెలుపగా తాగునీటి పైపులకు మరమ్మతులు చేశారు. అయినా గ్రామంలో జ్వరాలు అధికంగా ఉన్నాయని, వైద్యాధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. జ్వరాలపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారిని వివరణ కోరగా, పరిసరాలు పరిశుభ్రత మన అందరి బాధ్యత అన్నారు. ఇంటి చుట్టూ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం వల్ల జ్వరాలు వస్తున్నాయన్నారు. అలాగే తాగునీరు కాచి చల్లార్చుకుని తాగాలని, దోమలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సమాధానం తెలిపారు.

ఘనంగా ఆలయ మహా కుంభాభిషేకం



కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్న జెడ్పీటీసీ మాజీ సభ్యులు తిరుమలరెడ్డి

రేణిగుంట: మండలంలోని ఎల్లమండ్యం పంచాయతీ మర్రిగుంటలో వెలసిన సీతారామచంద్ర స్వామి మహా కుంభాభిషేక వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కుంభాభిషేక మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గణపతి హోమం, కలశ స్థాపన, విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన, ప్రత్యేకహోమ పూజలు చేశారు. ఈ వేడుకల్లో రేణిగుంట జెడ్పీటీసీ మాజీసభ్యుడు సి.తిరుమలరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగయ్య పాల్గొన్నారు. వీరికి ఉత్సవ నిర్వాహకులు పూర్ణకుంభ స్వాగతం పలికి ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ శిబిరం



పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ జ్ఞానేశ్వర్

సత్యవేడు: క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేస్తే మెదడు పాక్షిక పక్షవాతం, కాళ్లు చేతుల వంకర్ల లోపాలను నయం చేయవచ్చని డాక్టర్ జ్ఞానేశ్వర్ అన్నారు. భవిత కేంద్రంలో గురువారం ప్రత్యేక అవసరాల సహిత పిల్లలకు ఫిజియోథెరపీ శిబిరాన్ని ఎంఈఓ రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ఇక్కడ చేయించే తేలికపాటి వ్యాయామాలను రెండు పూటలా ఇళ్ల వద్ద తల్లిదండ్రులు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చేయిస్తే వైకల్యశాతం త్వరగా తగ్గే అవకాశాలు ఉందని చెప్పారు. ఎంఈఓ రవి మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లలకు వినికిడి మిషన్లు, ట్రై సైకిళ్ల క్యాలిపర్స్, వీల్ చైర్లు, ఎంఆర్ కిట్లు ఉచితంగా అందజేస్తోందన్నారు. ఈ భవిత కేంద్రం పరిధిలో 83 మంది పిల్లలు ఉన్నారని చెప్పారు. పలువురు పిల్లలకు వ్యాయామం చేయించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో ముగిసిన సదస్సు

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని అప్లయిడ్ మైక్రో బయాలజీ విభాగంలో రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ మైక్రోబియల్ టెక్నాలజీ అండ్ అలైడ్ సైన్సెస్ అనే అంశంపై రెండు రోజులుగా చేపట్టిన జాతీయ స్థాయి సదస్సు గురువారం ముగిసింది. బయోలాజికల్ ప్రాసెస్ ఫర్ కెఫెన్ డిగ్రిడేషన్‌పై ప్రొఫెసర్ సత్యనారాయణ ఎస్.గుమ్మడి ప్రసంగించారు. ఫైటో కెమికల్ అండ్ దేర్ బయో ఆక్టివిటీ స్పెషల్ రెఫరెన్స్ టు సైన్సెస్‌పై ప్రొఫెసర్ బి.ఆండాలు మాట్లాడారు. సదస్సు ముఖ్య ఉద్దేశాలను ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరి వివరించారు. అనంతరం విద్యార్థినులకు నిర్వహించిన మౌఖిక, పోస్టర్ ప్రదర్శనల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రొఫెసర్లు సువర్ణలతా దేవి, చండీకుమారి, జయమాధురి, వాణి, రుక్మిణి, జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

శరవేగంగా క్రికెట్ స్టేడియం పనులు



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: గొల్లవానిగుంట ప్రాంతంలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. ఆమె గురువారం పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ స్టేడియం పక్కన వెళుతున్న డ్రైనేజీ కాలువను త్వరగా పూర్తి చేయాలన్నారు. క్రీడాకారులకు అవసరమైన గదులు, మరుగుదొడ్లను వెంటనే నిర్మించాలన్నారు. కమిషనర్ వెంట డీఈ గోమతి, ఏఈకామ్ ప్రతినిధులు బాలాజీ, అనిల్, కాంట్రాక్టర్లు ఉన్నారు.